

కాఫీ సేవించి, బిల్లు కోసం నిరీక్షిస్తూ కూర్చున్నాము నేను, మురళీ.

ఇంతలో ఓ వృద్ధవనిత మా టేబుల్ ముందున్న మరో టేబుల్ దగ్గిర కూర్చుంది. మురళి తన మోచేతితో నన్ను పొడిచాడు, 'ఆవిణ్ణి చూడు' అన్నట్టు.

ఆవిడ నుదుట కుంకం లేదు. చేతులకు గాజులు లేవు. మామూలు దుస్తులు ధరించింది. ఎడమ భుజానికి ఒక పెద్ద సంచీ తగిలించింది. దానిలో పుస్తకాలు కాబోలు ఉన్నాయి.

'ఏమిటి కథ?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాను మురళివేపు.

"చెబుతాను, కానీ ఆవిణ్ణి బాగా చూడు" అన్నాడు మురళి. ఆవిడికి నమస్కరించాడు.

సర్వరు బిల్లుతో ప్రత్యక్షం కాగా, డబ్బులు చెల్లించి బయటపడ్డాము.

"ఎవరురా ఆవిడ?"

"నీకెలా కనిపిస్తూంది?" తిరిగి ప్రశ్నించాడు నన్నే.

"ఎవరో విధవస్త్రీలాగుంది. భుజంమీద వేలాడుతున్న సంచీని చూస్తే, ఎవరో క్రిస్టియన్ మిషనరీ స్త్రీ అనిపిస్తూంది."

"నీవన్నట్టు ఆవిడ విధవరాలే కాని క్రైస్తవురాలు కాదు. పోతే మిషనరీ స్పిరిట్ ఉంది. అదో పెద్ద కథ. ఆవిణ్ణి పొగడనివారే లేరు ఆకాలంలో. రాను రాను తన కీర్తి అంతా మాయమై, ఇప్పుడో సామాన్యురాలులాగ మిగిలిపోయింది."

నడుస్తూనే ఊరు అవతల ఉన్న పొలాలగట్టుమీద ప్రశాంతమైన చోటు చూసుకొని కూర్చున్నాము.

